# కాకితో కబుర్లు

కాకి అరిస్తే భయపడి ఓ ఇల్లాలు పెనిమిటిని గట్టిగా వాటేసుకుందిట – కాని నడిరాత్రి మొసళ్ళకు మాంసపు ముక్కల్ని విసురుతూ నర్మదానదిని దాటిందని భోజకాళిదాసు కథలలో ఓ స్టోరీ వుంది. కాకి అరిస్తే భయపడి మొగుడ్ని వాటేసుకునే ఇల్లాళ్ళు వుండటం నేటికీ చాలా అవసరం అని మావారంటారు. కొన్ని కాకులు కొత్త కోడళ్ళని 'కేర్' చెయ్యవు. 'ఇష్ ఇష్' అని గాజుల చేత్తో ఎంత విదిల్చి కొట్టినా ఆ పెంకుల మీంచి యీగోడ మీదకి, గోడ మీద నుంచి నూతి గట్టుమీదకి అక్కడ్నుంచి యిక్కడికి, యిక్కడ్నుంచి అక్కడికి గెంతు తాయ్ కాని ఓ పట్టాన కదలవు. కావు కావుమని కాకి అరిస్తే చుట్టాలొస్తారని మనవాళ్ళు సంబరపడిపోతారు.

పిల్లల చేతుల్లో కారప్పూస పొట్లంగాని, పకోడి పొట్లం గాని వుంటే దుష్ట కాకులు పై నుంచి ఎగురుకుంటూ వచ్చి తన్నుకుపోతాయి. జాంపండుకాని, ఏ పండయినా, కాయ అయినా తన్నుకుపోతాయి.

ఏకాక్షి లోకసంహారి అన్నట్లు కాకికి ఒకటే కన్నుఅనీ, అందుకే అది వంకరగా చూస్తుందనీ అంటారు. మనమీద ఆపేక్ష గల బంధువులూ, స్నేహితులూ –'కాకి చేత్తో కబురంపితే రానా' మీ రెందుకు శ్రమతీసుకు స్వయంగా రావడం అని ఆపేక్షగా అంటారు. మన నండూరి వారి ఎంకి కూడా 'కాకమ్మ చేతైన కబురంపడా రాజు ఈ రోజు నా రాత లే రాల పాలో' అని 'ఎన్నెట్లో సాపేసి కూకుని' మరీ పాడుకొంటుంది. ఎంకి పాటలు 'బావ' కవిత్వమే అంటారు కొందరు. నేనది వాళ్ళ 'మావ' కవిత్వమని అంటాను. కాకి మనకి ఏనాటి నుంచో పోస్ట్‌మేన్‌లా వుంటోంది. మీకు తెలుసో, తెలియదో కాకి దొండపళ్ళను తింటుంది. అలా దొండపళ్ళను తింటున్న కాకిని చూసి కవిగారు కాకి ముక్కుకి దొండపండు ఏల అని వూహించి అందమైన పెళ్ళి కూతుళ్ళ మీద ప్రయోగించి వుంటారు. మనుషుల్లో తెలివైన వాళ్ళూ, తెలివితక్కువ వాళ్ళూ వున్నట్టుగానే కాకుల్లోను అన్‌వైజ్ కాకులంటాయి. అల్లాటి కాకే మాంసపు ముక్కని నోట కరుచుకుని (కాకికి ముక్కూ నోరూ ఒకటే) నక్క బావ (బావలందరూ నక్కలు కారు సుడీ) ఓ పాట పాడమనగానే నోరు తెరిచిందట. సంగీతం వంటి లలిత కళల మీద కాకులకు ఆసక్తి వుండటం ప్రమాదకరమని తెలుస్తోంది. పైగా ఎవరేనా వుబ్బేస్తే మనం కూడా వుబ్బులింగడ్లా వుబ్బిపోయి పాడమంటే డాన్సు కూడా చేస్తాం. అన్నం దగ్గర మాట్లాడితే మనవాళ్ళు కూడా 'నోరు మూసుకు తిను' అని కేకలేస్తారు. (నోరు మూసుకుని ఎల్లా తినడం అని మీరు నవ్వక్కర్లేదు – అంటే మాట్లాడక నోరు మూసుకు తిను అన్నా మళ్ళీ మీరు నవ్వక్కర్లేదు). 'సైలెన్స్–ఏమిటా కాకిగోల' అని మా మేస్టారు బెత్తాన్ని బల్ల మీద కొట్టి మరీ క్లాసులోకి వస్తూనే అరిచేవారు. అరిచే మేస్టర్లు కొట్టరని గ్యారంటీ ఏమీ లేదు. అసలు క్లాసులోకి రాగానే మేస్టర్లు యిద్దర్ని బాదితే మొత్తం క్లాసు క్లాసంతా కాకిగోల మానేసి పాఠాలు శ్రద్ధగా వింటారు.

కాకులికి ఎండు మిరపకాయలన్నా, మిరపగింజలన్నా యిష్టం. మిరపకాయలు ఎండపెట్టినపుడు కాకి ఈక తెచ్చి కర్రకో దేనికో కట్టి నిలబెడితే - మరి కాకులెందుకో ఆ చెంతకు రావు. కాకుల్లో ఇంటెలిజంటు కాకులు కూడా వున్నాయి. ఓ వేసం కాలం కూజాలో నీళ్ళు అట్టడుగున వుంటే అందులో రాళ్ళు వేసి నీటిని పైకి రప్పించి దప్పిక తీర్చుకున్న కాకి గురించి చదివాము. ఈ కథ మరీ నమ్మబుల్లా లేదు. ఎందుకంటే తాగే నీళ్ళలో రాళ్ళు వేస్తే ఆ నీరు 'గందా' అవుతుంది. లేదా ఆ రాళ్ళు ఆ నీటిని పీల్చుకోవచ్చు అంత ఫిజిక్సు కాకికి తెలిసే అవకాశం లేదు. నీళ్ళు పైకి రాడమంటే మాటలా?

అదలా వుంచితే 'ఏకాకి' అంటారు. ఏకాకిలో కాకి కాకేనా? శాన్‌స్క్రిటా? ప్రపంచంలో ఏ కాకయినా కాకి భాషే మాట్లాడుతుంది గాని అవి లింగ్విస్టులు కావు. నాలుగు మెతుకులు విదిలిస్తే కాకి చక్కగా వచ్చి వాటిని ఏరుకుని తింటుంది. అన్నట్లు వేమన్న గారికి కాకులంటే పడదు.

మనవాళ్ళు ఎవరయినా పోయినపుడు వాయసపిండం అని చిన్న అన్నం పిడచ నేతితో ముట్టించి వేస్తారు. ఆ కర్మ చేసే పది రోజులూ, ఒక వేళ కాకి వచ్చి ముట్టుకోకపోతే ఆ కర్మ చేసేవాళ్ళు అయిన వాళ్ళు దండం పెట్టుకుంటారు. మృతుని అభీష్టానికి వ్యతిరేకంగా ఏమీ చేయమని ఇలాగే లెంపలు వేసుకుని మొక్కుకుని కాకిని పిండం ముట్టుకోనిమ్మంటారు. కాకి ఆ అన్నం పిడచ తింటే పితృదేవతలు తిన్నట్టే తృప్తి పడతారు.

వేమన్నగారికి వైదిక సంస్కృతి అంటే వొళ్ళు మంట. 'పియ్యి తినెడి కాకి పితురుడెట్టాయెరా' అని అనగూడని లేకి మాట కాస్త అన్నాడు. మానవ శరీరమే మల భూయిష్ట ధామం అయినపుడు కాకిని అడ్డం పెట్టుకుని హిందూ సంస్కృతిని నిందింపనేల? అంచేతే నేను వేమనకు కొంచెం రెస్పెక్టు ఇవ్వచ్చుగాని, బంగోరె తదితరులిచ్చినంత కాదు. వేమన కవి కూడా కాదు. సూత్ సీయర్ మాత్రమే. సత్యం బ్రూయాత్ ప్రియంబ్రూ యాత్ నబ్రూయాత్ సత్యమప్రియం అందుకని నోరు మూసుకుంటున్నాను.

కాకులంటే విమానాలునడిపే వారికి చచ్చేటంత భయం. కాకి గనుక ప్రొఫెల్లరులో పడి నలిగి చస్తే విమానంవాడు వెంటనే ఇనుప డేగను భూమార్గం పట్టించి భూమ్మీద దింపేస్తాడు. కాకులు స్నానం చేస్తాయి - అవి సామూహికంగా చేస్తాయి. బంధువు లెక్కువగా వున్న వాళ్ళని కాకి బలగం అనీ కాకి మూక అని తేలిగ్గా రిఫర్ చేస్తూ వుంటారు. కాకికి సామాజిక స్పృహ, సామాజిక చైతన్యం ఎక్కువ. ఎక్కడైనా తినడానికి ఏదైనా చూస్తే ఒకకాకి పది కాకుల్ని రారమ్మని పిలుస్తుంది. సహకార ఎన్నికలలో నెగ్గాలంటే కాకి గుర్తునే పెట్టుకోవాలి. కాకి ఎంత మంచిదంటే అది తనకు తెలీకుండా కోకిల పిల్లల్ని పొదుగుతుంది. కోకిల చాలా లేజీఅండ్ కన్నింగ్ పక్షి. కవులు సహజంగా సోమరిపోతులు కదా! చిన్న పిల్లలు కాకి ఎంగిలి అని గుడ్డలో జాంపండునో కొబ్బరి ముక్కనో కరకజ్జాన్నో దేన్నో ఒకదాన్ని కొరికి పక్క వాళ్ళకి పెడుతుంటారు. కాకి ఎంగిలి (మనకు పెద్దాళ్ళకు) ఎంగిలే కాని పిల్లలకు అది ఎంగిలితో సమంకాదు.

అయితే కాకాసురుడని ఒక రాక్షసుడుండేవాడు. వాడు పరమ స్కవుండ్రల్. ఓసారి సీతా అమ్మవారిని లోకమాతను కాకిరూపంలో వచ్చి వక్షస్థలం మీద కొరికాడు. జగన్మాత వాడికి కూడా తల్లే నన్న ఇంగితం వాడికి లేదు. పాపిష్ఠి వెధవ! అప్పుడు శ్రీరామ చంద్రులవారు రామ బాణాన్ని సంధించి వేశారు. అయ్యా ఇక చూస్కోండి ముందు కాకాసురుడు, వెనుక రాంబాణమూను. ముల్లోకాలూ తిరిగాడు. బంగళాదేశ్ వెళ్ళాడు. శ్రీ లంక వెళ్ళాడు. పాకీస్తానం వెళ్ళాడు. ఎక్కడకు వెళ్ళినా రాంబాణానికి తిరుగులేదు. మేం ఇంటర్ ఫియర్ కాం అన్నవారే – కాకాసురుడు చేసేది లేక, తావుల్ తప్పి 'ఇప్పుడు నేనేంచెయ్యాలి. రాంబాణం దెబ్బకు చావకుండా బతకాలంటే' అని తెలుగుదేశం వాళ్ళు చంద్రబాబు నాయుణ్ణి అడిగినట్టు అడిగాడు. అప్పుడు నారదుడో మరెవరో రుషి చిరునవ్వు నవ్వి – 'నువ్వెళ్ళి సీతమ్మ మాయమ్మ అని అమ్మవారి కాళ్ళమీద పడి శరణు శరణు తల్లీ' అని వేడుకోపొమ్మని పాయింట్ చెప్పారు. అప్పుడు కాకాసురుడు వెళ్ళి తల్లి కాళ్ళమీద పడ్డాడు కావవే బ్రోవవే జగన్మాతా అంటూ. పోన్లెండి కాకి వెధవ మీదా మీ ప్రతాపం – వాడ్నేమీ అనకండి అని శరణు ఇచ్చింది. (మా చిన్నప్పుడు మగ పిల్లలు ఆటల్లో శరణురా శరణు అని కుర్రాళ్ళల్లో కాస్త రవుడీల్లాటి పెర్సనాలిటీల్ను చూసి శరణడిగినవాడి వెనక్కాల దాక్కుంటూ – ఆ వచ్చిన వాడి చేత తినవలసి తన్నులన్నీ ఈ శరణిచ్చిన వాడు తినేవాడు) అప్పుడు శ్రీ రామచంద్రులు అన్నారు గదా –

నాది రాంబాణం వదిల్తే దేన్నో ఓ దాన్ని కొట్టకుండా తిరిగిరాదు. దీన్ని విత్ డ్రా చేయడానికి నాక్కూడా పవర్స్ లేవు పొమ్మన్నాడు.

అప్పుడు కాకాసురుడే నాకు రెండు కళ్ళున్నాయి. చేసిన వెధవ పని ఎలాగూ చేశాను. నా కన్ను మీద కొట్టమని రాంబాణానికి సరెండరయ్యాడు. ఆ విధంగా కాకికి ఒక కన్ను కాస్తాపోయింది.

అమ్మ ఔదార్యం అమ్మదే –

# సంగీత సరస్వతి

సంగీతం ఎక్కడ వుంది అని అడిగే వారికి జవాబు సంగీతం ఎక్కడలేదు అని అడిగితే సరిపోతుంది.

చెట్లకొమ్మల సందుల నుంచి, ఆకుల్ని గలగలమనిపిస్తూ రివ్వున వీచే గాలి చేసే చప్పళ్ళలో ఎన్ని మార్దవాలున్నాయి?

టపటపమని వాన చినుకులు ఆకాశం నుంచి బయల్దేరి భూదేవిని ముద్దాడే లోపల ఎన్ని ధ్వనులు ఎన్ని వింతల్ని సృష్టిస్తాయి?